క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మునగపాక: మునగపాక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఆ శాఖ ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా మునగపాక టౌన్, రూరల్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. చెట్ల తొలగింపులో భాగంగా తిమ్మరాజుపేట, పాత నాగవరం, కొత్త నాగవరం, వాడ్రాపల్లి, గొల్లలపాలెం, కుంచవానిపాలెం గ్రామాల్లో కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఓటరు జాబితాలను సరిచూసుకోవాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక: ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలను సరి చూసుకోవాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్‌లో బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు ఉంటే సరి చేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటి నుంచే ఓటరు లిస్టులను క్షుణ్ణంగా పరిశీలించి ఎక్కడా తప్పులు లేకుండా చూడాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యారా? లేదా? పరిశీలించాలన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి బీఎల్‌ఓలు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు తప్పులను సవరించాలని సూచించారు. మండల సర్వేయర్ రవీంద్ర పాల్‌దాస్, పలువురు వీఆర్వోలు, బీఎల్‌వోలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయానికి విరాళం



మునగపాకలోని సత్తెమ్మతల్లి అమ్మవారికి విరాళం అందిస్తున్న అప్పలనాయుడు

మునగపాక: మునగపాకలోని చెరువు కాలువ సంఘం పరిధిలో తలపెట్టిన సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం మునగపాకకు చెందిన శ్రీచక్ర ఫాల్ జీ బ్రిక్స్ అధినేత ఆడారి అప్పలనాయుడు తనవంతు సాయంగా రూ.10,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దాడి చంద్రరావు, వెలగా అప్పలనాయుడు, సభ్యులు బొడ్డేడ అప్పలనాయుడు, వెలగా వెంకటప్పారావు, వెలగా ధర్మసూరి, వెలగా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏజీపీగా గోవిందరావు


న్యాయవాది గోవిందరావు

యలమంచిలి రూరల్: యలమంచిలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(సహాయ ప్రభుత్వ న్యాయవాది)గా యలమంచిలికి చెందిన సీనియర్ న్యాయవాది రాజాన గోవిందరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయ శాఖ జీవో ఆర్టీ నెంబరు 371 విడుదల చేసింది. ప్రభుత్వం తరపున మూడు సంవత్సరాల కాల వ్యవధికి సివిల్ కేసులను ఆయన వాదిస్తారు. ప్రభుత్వం ఆయనకు నెలకు రూ.10వేల గౌరవ వేతనం చెల్లిస్తుంది. ఏజీపీగా నియమితులైన గోవిందరావును పలువురు న్యాయవాదులు, యలమంచిలి బార్ అసోసియేషన్ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

నాగులాపల్లి పీఏసీఎస్ సమావేశం రేపు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో శుక్రజువారం పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు సంఘ సీఈవో మళ్ల స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సంఘ పర్సన్ ఇన్‌చార్జి యల్లపు వెంకట భాస్కరరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రైతులు హాజరుకావాలన్నారు. సొసైటీకి ఇప్పటి వరకు రూ.56,12,958 నికర లాభం వచ్చిందన్నారు. 2025–26 సంవత్సరానికి సంబంధించిన అంచనా ఆదాయ, వ్యయాలకు సంబంధించి ఆమోదం జరుగుతుందన్నారు. సంఘ పరిధిలోని రైతులు ఈ సమావేశానికి హాజరై సంఘ అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని కోరారు.

ప్రభుత్వ పాలనలో జరుగుతున్న మంచిచెడుల సమాచారంపై ప్రతి పౌరుడు అవగాహన పెంచుకునేందుకు ప్రజలకు అందుబాటులో ఉన్న పాశుపతాస్త్రం సమాచార హక్కు చట్టం. అయితే కొంత మంది అధికారుల తీరుతో చట్టం అపహాస్యమవుతోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అవగాహన కల్పించాల్సిన అధికారులే దీనిపై చిన్నచూపు చూస్తున్నారు. స.హ. చట్టంపై నేటి యువతలో అవగాహన కొరవడుతోంది.

సమాచారం.. అపహాస్యం..!


సమాచారహక్కు చట్టం బోర్డు కూడా లేని యలమంచిలి సీహెచ్‌సీ

- స.హ. చట్టంపై అధికారుల అలసత్వం
- బోర్డులు కూడా ఏర్పాటు చేయని పలు శాఖల అధికారులు
- పాలకుల తీరుతో నానాటికీ కనుమరుగవుతున్న చట్టం

యలమంచిలి రూరల్: సమాచార హక్కు చట్టం 2005 మే 11న అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో అవినీతి, అక్రమాల నియంత్రణే గాక ప్రభుత్వ పథకాల్లో అవకతవకలను ఈ చట్టంతో నియంత్రించవచ్చు. కానీ నియోజకవర్గ కేంద్రం యలమంచిలిలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం ప్రాధాన్యతను తెలిపేలా బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉండగా కొన్ని కార్యాలయాల్లో అసలు బోర్డులే లేవు. మరికొన్ని కార్యాలయాల్లో గతంలో పనిచేసి, బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన పేర్లతో బోర్డులు దర్శనమిస్తున్నాయి. సమాచార బోర్డులో అప్పిలేట్ అథారిటీ పేరు, ఫోన్ నెంబరుతో సహా వివరాలను తెలియజేయాల్సి ఉన్నప్పటికీ చాలా శాఖల అధికారులు అవేమీ పట్టించుకోవడం గమనార్హం.

యలమంచిలిలో తీవ్ర నిర్లక్ష్యం

యలమంచిలి పట్టణంలో 50 పడకల ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి, యలమంచిలి పంచాయతీరాజ్ డీఈఈ, ప్రాజెక్ట్స్ డీఈఈ, విద్యుత్‌శాఖ ఏఈ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయలేదు. జలవనరుల శాఖ డీఈఈ కార్యాలయంలో గతంలో బదిలీపై వెళ్లిన ఉద్యోగుల పేర్లతో బోర్డు ఉంచారు. ఇవే కాకుండా వివిధ శాఖల అధికారుల కార్యాలయాల్లో సమాచార బోర్డులపై తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. వాస్తవానికి ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అందరికీ కనిపించేలా విభాగాల వారీగా సమాచార, సహాయ సమాచార అధికారుల పేర్లు బోర్డుల్లో పొందుపరచాలి. అప్పిలేట్ అధికార్ల పేర్లు స్పష్టంగా కనిపించేలా చూడాలి. సమాచార, సహాయ సమాచార అధికారుల స్థానంలో ఎవరైనా కొత్తగా వస్తే ఎప్పటికప్పుడు బోర్డులో పేర్లను నవీకరించాలి. కానీ యలమంచిలిలో కొన్ని కార్యాలయాల్లో సమాచార బోర్డుల వైపు అధికార్లు కన్నెత్తి చూడడంలేదు. సమాచార దరఖాస్తులు ఎక్కువగా వస్తే నిర్ణీత గడువులోగా సమాచారం ఇచ్చే క్రమంలో తమకు ఎక్కడ పనిభారం పెరుగుతుందోనన్న ఉద్దేశంతో కూడా కొందరు ప్రభుత్వ అధికారులు ఈ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. ఈ చట్టంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు, ఉద్యోగులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్టీఐ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.



రోడ్లు, భవనాల శాఖ డీఈఈ కార్యాలయంలో ఫోన్ నెంబర్లు గానీ, ఈ మెయిల్ వివరాలు గానీ లేకుండా పెట్టిన బోర్డు


పాత అధికారుల వివరాలతో బోర్డు ఏర్పాటు చేసిన జలవనరుల శాఖ డీఈఈ కార్యాలయం

అక్రమాలు బయటపడకూడదనే..



ప్రభుత్వ కార్యాలయాల్లో కొందరు అధికారులు పాల్పడుతున్న అక్రమాలు, అవినీతి చర్యలు బయటపడకుండా ఉండడానికే స.హ చట్టం గురించి సమాచార బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి, వారిలో చైతన్యం తేవాల్సిన అధికారులు ఇలా వ్యవహరించడం దురదృష్టకరం. ఈ చట్టంతో భారీ కుంభకోణాలను వెలుగులోకి తీసుకొచ్చిన సందర్భాలున్నాయి. ప్రభుత్వ పథకాలు, పౌరుల సేవల్లో అవకతవకలను ఈ చట్టంతో వెలికి తీయవచ్చు. – చాకలి నూకరాజు, ఆర్టీఐ కార్యకర్త, జంపపాలెం, యలమంచిలి

స.హ చట్టానికి తూట్లు



స.హ చట్టంపై కొందరు అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. చట్టం సక్రమంగా అమలు కాకుండా తూట్లు పొడుస్తున్నారు. యలమంచిలిలో చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార బోర్డులు ఏర్పాటు చేయలేదు. సమాచార దరఖాస్తులకు మున్సిపల్, ఇతర శాఖల అధికారులు సరైన సమాచారం ఇవ్వకుండా దాటవేత ధోరణితో సమాధానం ఇస్తున్నారు. చట్టం పటిష్టంగా అమలైతే సామాన్యులకు మేలు జరుగుతుంది. – వేగి వెంకట్రావు, ఆర్టీఐ యాక్టివిస్టు, యలమంచిలి

అధినేతతో ఆత్మీయ భేటీ



గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌ను ఆ పార్టీ పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోగులు, యలమంచిలి సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు మర్యాద పూర్వకంగా కలిశారు.

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు


ఎస్.రాయవరంలో కొబ్బరి చెట్ల కింద చదువుతున్న ఓ పాఠశాల విద్యార్థులు

ఎస్.రాయవరం: దసరా సెలవులు ఇవ్వని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ డిమాండ్ చేశారు. మండలంలో బుధవారం పలు పాఠశాలలను ఆయన సందర్శించారు. సెలవుల్లో తరగతులు నిర్వహించవద్దని కోరారు. పాఠశాలకు రాకపోతే రూ.200 జరిమానా కట్టాల్సిందేనని పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. ఈ సమస్యను జిల్లా విద్యా శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. మండలంలో ఓ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సమీపంలో కొబ్బరి చెట్ల కింద చదువులు సాగిస్తున్నారన్నారు. విద్యార్థులు సౌకర్యం లేని ప్రదేశాల్లో తిరగడం వల్ల విష సర్పాల బారిన పడితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. జిల్లా అధికారులు దృష్టి సారించి తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోషకాహారంతోనే మహిళల ఆరోగ్యం


మాట్లాడుతున్న స్త్రీల వైద్య నిపుణులు నాగలక్ష్మి

మునగపాక: ప్రతి మహిళ ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే ఆ కుటుంబం బలంగా ఉంటుందని ప్రముఖ వైద్య నిపుణురాలు ఎం.నాగలక్ష్మి అన్నారు. మండలంలోని ఒంపోలు సచివాలయ ప్రాంగణంలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు, బాలికలు సహజ సిద్ధమైన కూరగాయలు, పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. స్త్రీలకు వచ్చే వ్యాధులు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ విమలగిరి అవగాహన కల్పించారు. మధుమేహం, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ తదితర వ్యాధులకు తప్పనిసరిగా స్క్రీనింగ్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నేత నరాలశెట్టి సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ ఉల్లింగల గోవింద, పీహెచ్‌సీ సీహెచ్‌వో దేవకాంత, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎండీడీవో సీతారామరాజు

నక్కపల్లి: గ్రామ అవసరాలు, ప్రజల అభిప్రాయాలు, అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో సీతారామరాజు, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం సూచించారు. బుధవారం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నక్కపల్లి, పాయకరావుపేట మండలాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామసభలు, పంచాయతీ సమావేశాల ద్వారా గ్రామస్తులను భాగస్వామ్యం చేయాలన్నారు. స్థానిక సంస్థల ప్రతినిధులుగా గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కీలక భూమిక పోషించాల్సి ఉంటుందన్నారు. అప్పటికప్పుడు నిర్ణయించుకునే కంటే ముందుగానే అవసరమైన మేరకు పనులు ఎంపిక చేసి, నిధులు సమకూర్చుకోవడానికి కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ రూపాల్లో నిధులు సమకూరుతున్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవడానికి ప్రజాప్రతినిధులు చొరవ చూపాలన్నారు. అలాగే నిధులు పక్కదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు.

మేలు జాతి పశువుల పెంపకం మేలు


ఉచిత గర్భకోశ వ్యాధి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మునగపాక: రైతులు మేలుజాతి పశువులను పెంచడం ద్వారా అధిక పాల దిగుబడులు సాధించవచ్చని పశు సంవర్ధక శాఖ ఏడీ సీహెచ్.గణేష్ పేర్కొన్నారు. తరచూ పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించడం మంచిదన్నారు. మండలంలోని పల్లపు ఆనందపురంలో బుధవారం జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ నిధులతో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ కర్రి పెదబ్బాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఎదకు రాని పశువులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. పశువులకు రక్త పరీక్షలు, పేడ నమూనా సేకరించి పాల దిగుబడులు పెంచుకునేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. డాక్టర్లు సౌజన్య, శివకుమార్, ఉమామహేశ్వరి, సుమతి, సూర్య తేజశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

'నిబంధనలకు విరుద్ధంగా షాపుల వేలం'


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న దగ్గుపల్లి సాయిబాబా

పాయకరావుపేట: పట్టణంలోని పంచాయతీకి సంబంధించిన అద్దె వేలం పాటలో కూటమి నాయకులు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించారని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా విమర్శించారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కూటమి నాయకులకు పంచాయతీ షాపులపై అత్యాస కలిగిందన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ఇద్దరు వ్యక్తులకు పంచాయతీలో షాపులు ఉన్నాయని, వారిని ఏవిధంగానైనా షాపుల నుంచి తొలగించాలన్న ఉద్దేశంతో 6 నెలలు ముందుగానే వేలం నిర్వహించారని చెప్పారు. వేలం వేసినప్పటికీ 10 శాతం అద్దె కూడా కొన్ని షాపులకు పెరగలేదన్నారు. దీనిపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా జరిగిన షాపుల వేలం పాటను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వేలం పాట విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు, జిల్లా పంచాయతీ అధికారికి కూడా ఫిర్యాదు చేయనున్నట్టు ఆయన తెలిపారు. కూటమి నాయకులు పంచాయతీకి పెరిగే ఆదాయానికి గండి కొట్టి వ్యక్తిగత ప్రయోజనాల కోసం పాడుపడుతున్నారని ధ్వజమెత్తారు.

అన్నపూర్ణదేవి అవతారంలో కనకదుర్గమ్మ


పల్లపు ఆనందపురంలో అన్నపూర్ణదేవీ అలంకరణలో కనకదుర్గ అమ్మవారు


మునగపాక ఇందిరమ్మ కాలనీలో అన్నసమారాధన

మునగపాక: మండల వ్యాప్తంగా కనకదుర్గ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పలు గ్రామాల్లో అన్నసమారాధనలు, అంబలం పూజలు నిర్వహిస్తున్నారు. మునగపాక యాతపేటలో మంగళవారం రాత్రి భారీ అంబలం పూజ చేశారు. మునగపాక ఇందిరమ్మ కాలనీలో అన్నసమారాధన నిర్వహించారు. బుధవారం కనకదుర్గ అమ్మవారు భక్తులకు అన్నపూర్ణదేవీ అవతారంలో దర్శనమిచ్చారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం


అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: గ్రామ పంచాయతీలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో అభివృద్ధిని సాధించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తిని పెంచేలా అధికారులు కృషి చేయాలన్నారు. శాఖలు సమన్వయంగా పనిచేసి పంచాయతీల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, విద్యుత్, ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏటికొప్పాకలో యూరియా కష్టాలు


ఏటికొప్పాక సచివాలయం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

యలమంచిలి రూరల్: మునుపెన్నడూ లేని విధంగా కూటమి సర్కారు నిర్వాకంతో పంటలకు అవసరమైన ఎరువు వేయలేని దుస్థితి నెలకొంది. 2019–24 మధ్య వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఐదేళ్లూ ఎక్కడా యూరియా సమస్య ఎదురుకాలేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. యలమంచిలి మండలంలో ఎక్కడా యూరియా కొరత లేదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. బుధవారం యలమంచిలి మండలం ఏటికొప్పాక సచివాలయం వద్ద యూరియా పంపిణీ కోసం రైతులు పడిన కష్టాలే ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి రైతులు సచివాలయం వద్ద గంటల తరబడి క్యూలైన్లో ఎండలో పడిగాపులు పడ్డారు. మధ్యాహ్నం 12 గంటలైనా యూరియా పంపిణీ ప్రారంభించకపోవడంతో రైతులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అవసరమైనంత యూరియా పంపించకపోవడంతో రైతులు తోపులాటలకు దిగాల్సి వస్తోందని, ఒక బస్తా యూరియా కోసం రైతులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏటికొప్పాక గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు శ్రీనివాసరావు మండిపడ్డారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తత అవసరం

కొంకోట: పశువులకు సోకే గాలికుంటు వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ చంద్రశేఖర్ కోరారు. మండలంలోని నూతలగుంటపాలెంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడుతూ నాలుగు నెలలు దాటిన పశువులన్నింటికి గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేయాలని సూచించారు. చికిత్స కంటే నివారణ ఎంతో మేలని, సకాలంలో టీకాలు వేయడం వల్ల పశువులకు వ్యాధులు ప్రబలే అవకాశం తగ్గుతుందన్నారు. వచ్చే నెల 15 వరకు జరిగే కార్యక్రమాన్ని పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశు వైద్యాధికారి అల్ఫోన్సా జార్జ్, పశు వైద్య సిబ్బంది రఘువీర, రాజేష్, భవాని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాలినడకన కొండకు భవానీ భక్తులు


కాలినడకన కొండకు వెళ్తున్న భక్తులకు వాటర్ బాటిల్ అందిస్తున్న శ్రీనివాసరావు

ఎస్.రాయవరం: కాలినడకన విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్తున్న భవానీ మాలధారణ భక్తులకు గోకులపాడులో దుర్గమ్మ సన్నిధానం వద్ద బుధవారం మధ్యాహ్నం భిక్ష ఏర్పాటు చేశారు. గాజువాక నుంచి పి.నాగబాబు, రాంబిల్లి మండలం చినకలువులాపల్లి గ్రామం నుంచి జి.శంకర్ కాలినడకన అమ్మవారి సన్నిధికి బయలు దేరారు. ఈ మేరకు భిక్ష చేసి బయలు దేరిన భవానికి స్థానిక ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగంబోయిన శ్రీనివాసరావు వాటర్ బాటిల్ అందజేసి సాగనంపారు.

అడ్డురోడ్డులో ట్రాఫిక్ సమస్య


అడ్డురోడ్డు ట్రాఫిక్ సమస్య

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు జంక్షన్‌లో రోజురోజుకూ ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్నాయి. అభయాంజనేస్వామి గుడి నుంచి కొత్త హైవే వరకు బుధవారం ట్రాఫిక్ స్తంభించిపోయింది. పార్కింగ్‌లేని ప్రదేశంలో ఆటోలు అడ్డదిడ్డంగా పెట్టడం , పర్మినెంట్ దుకాణదారులు రోడ్డుపైకి వచ్చి వస్తువులు విక్రయించడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. పోలీస్ పికెట్ లేకపోవడడంతో ట్రాఫిక్ సమస్య కొనసాగింది.

ఆలోచింపజేసిన నాటికలు


ఆవేశంలో ఆనందం హాస్య నాటికలో ఓ సన్నివేశం

అనకాపల్లి: నాటికలకు అనకాపల్లి పుట్టినిల్లని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. సతకం పట్టు కనకదుర్గమ్మ ఉత్సవాల్లో భాగంగా స్థానిక గరవరపాలెం గౌరీ సేవ సంఘంలో కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల ప్రదర్శనను బుధవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. తొమ్మిది సంవత్సరాలుగా దేవీ నవరాత్రుల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. చిన్న చిన్న విషయాలకు ఆవేశపడి ఆత్మహత్యలు చేసుకుంటున్న వారి బతుకు ఆ కుటుంబానికి ఎంత అవసరమో తెలియజెప్పేలా 'ఆవేశంలో ఆనందం' హాస్య నాటికను ప్రదర్శించారు. జీవితపు చరమాంకపు దశలో ఎలా బతకాలో ఓ దంపతులు రాసుకున్న ప్రణాళికే 'ఇది అతని సంతకం' నాటిక కదాంశం. ఈ నాటిన అందర్నీ ఆకట్టుకుంది.